క్లుప్తంగా

ప్రజా దర్బార్ నేడు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ ఉంటుందన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందినవారు వారి సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అలాగే చింతల బడవంజ గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఐసీడీఎస్ సీడీపీవో విమలకుమారి తెలిపారు.

అమ్మవారికి ముర్రాటలు



అమ్మవారి సన్నిధిలో భక్తులు

జలుమూరు: మండలంలోని జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటలో గ్రామ దేవతకు మంగళవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి అమ్మవారికి నూతన వస్త్రాలు, అరటి గెలలు, ప్రత్యేక పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. అలాగే కోళ్లు, పొట్టేళ్లు సమర్పించారు. దానికి ముందు ఘటాలతో పసుపు, కుంకుమలతో అమ్మవారి చల్లదనం ముర్రాటలతో పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గంగువాడ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పాతపట్నం: మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పి.వల్లభరావు తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీల్లో ప్రతిభ కనబర్చారన్నారు. బాలికల చదరంగం అండర్–14లో ఎం.జోషిత, బాలురు సాఫ్ట్ టెన్నిస్ అండర్–14లో జె.వీరేంద్ర, రగ్బీ అండర్–14లో బి.వేణుసాయి, బాలుర విభాగం అండర్–17లో జె.వికాస్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరిని పాఠశాల సిబ్బంది మంగళవారం అభినందించారు.

కళా జాతరకు గజల్ రాములు



ఆమదాలవలస: ఈనెల 19, 20వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డా.కె.ఎ.రాములు ఎంపికైనట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఆయన జానపద గేయాలు, మౌత్ ఆర్గాన్, గజల్ సాంగ్స్ ప్రదర్శించనున్నారు. దీంతో పలువురు అభినందనలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



లింగాలవలసలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని లింగాలవలస, ఎస్టీ మాకివలస గ్రామాల్లో రూ.1.92 కోట్లతో ఉపాధి నిధులు నుంచి బీటీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీవో కొమరాపు అప్పలనాయుడు, టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో మరో నలుగురు అరెస్టు

నరసన్నపేట: పోలాకి మండలం వనవిష్ణుపురంలో పాలిన వీరస్వామి హత్య కేసులో మంగళవారం మరో నలుగురిని అరెస్టు చేశామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేశామని, తాజాగా ఏ–2 పాలిన మోహనరావు, ఏ–3 పాలిన శ్యామసుందరరావు, ఏ–9 ఇప్పిలి కోటేశ్వరరావు, ఏ–12 తలగాన లవన్నలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. వీరికి మెజిస్ట్రేట్ హరిప్రియ 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గుణాత్మక విద్యనందించాలి

జలుమూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు విలువలతో కూడిన గుణాత్మక విద్యనందించాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్‌వీవీఎస్ ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని మర్రివలస యూపీ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. అలాగే చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి బోధించాలన్నారు. ఆయనతోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

హుండీ లెక్కింపు నేడు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గ ఆలయంలో ఉన్న కానుకల హుండీలను బుధవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో టి.వాసుదేవరావు మంగళవారం తెలిపారు. లెక్కింపునకు హాజరయ్యే భక్తులు డ్రస్‌కోడ్ పాటించాలని స్పష్టం చేశారు.

బిల్లుల మోతకు చెల్లు..!



సోలార్ ప్యానెల్

- పీఎం సూర్యఘర్‌తో ఇంటింటా సౌర కాంతులు
- విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలకు చెక్
- రాయితీతో సోలర్ రూఫ్‌టాప్ ప్యానెల్



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

హిరమండలం: విద్యుత్‌ను ఆదా చేసుకునేందుకు, సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సామాన్యులకు కరెంటు బిల్లుల నుంచి ఉపశమనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రతీ ఇంటా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రాయితీలను ప్రకటించింది. రాయితీ నగదుతో పాటు సోలార్ సిస్టమ్‌ను అమర్చుకునేందుకు అయ్యే ఖర్చు బ్యాంకులు రుణాల కింద అందజేయనున్నాయి. ఈ పథకంలో భాగంగా గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతి తక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని విద్యుత్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటిపైన కనీసం 10 చదరపు అడుగులు స్థలంలో వన్ కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలర్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే, విద్యుత్ ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని ప్రయోజనాలపై విద్యుత్ శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఈ పథకంలో భాగంగా బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది.

సోలార్ రాయితీలు ఇలా...

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో భాగంగా 1 కిలోవాట్‌తో 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.1000 బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.333 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. 2 కిలోవాట్‌లతో 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.2 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.338 మాత్రమే వస్తుంది. దీనికోసం ప్రభుత్వం రూ.60 వేల రాయితీని అందజేస్తుంది. 3 కిలోవాట్‌లతో 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందున, సాధారణంగా రూ.3 వేలు బిల్లువచ్చే వినియోగదారునికి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.78 వేలు రాయితీని అందజేస్తోంది. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

కిలో వాట్‌లు	ఖర్చు	రాయితీ	యూనిట్లు
ఒకటి	రూ.83 వేలు	రూ.33 వేలు	120
రెండు	రూ.114 వేలు	రూ.60 వేలు	240
మూడు	రూ.210 వేలు	రూ.78 వేలు	360

పథకాన్ని ఇలా పొందవచ్చు

- పీఎం సూర్యఘర్ యోజనను పొందేందుకు గృహ వినియోగదారులు వాడే విద్యుత్ యూనిట్లు రూ.300 లోపు ఉండాలి.
- సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో వినియోగదారుడు వివరాలను నమోదు చేసుకోవాలి.
- ఆరు నెలల బిల్లులను జత చేయాలి
- అవసరమైన కిలోవాట్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.
- మూడు కిలోవాట్‌ల లోపు సర్వీస్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఐదు కిలోవాట్‌లకు రూ,1,900లు, ఆపై రూ.5,900లు చెల్లించాలి. పది కిలోవాట్‌ల పైబడిన హెచ్‌టీ సర్వీస్‌లకు రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో రూ.11,900 చెల్లించాల్సి ఉంటుది.
- సబ్సిడీ పోను మిగిలిన మెత్తానికి బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయి. వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది.

అవకాశం వినియోగించుకోండి



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ బిల్లు ఆదా, కలిగే ఇతర ప్రయోజనాలను వివరిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని సెక్షన్ కార్యాలయాల్లో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం

– జి.శంకర్‌రావు, విద్యుత్ శాఖ ఈఈ, టెక్కలి, పాతపట్నం

పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. దసరా పోయిన మారువారం కావడంతో మంగళవారం అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

– పాతపట్నం

అప్రమత్తం



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య కార్యకర్త సరోజిని, సీఆర్పీ పట్ట వైకుంఠరావు అన్నారు. మంగళవారం చెన్నయవలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వేడి ఆహారం తీసుకోవడం, భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడంపై వివరించారు. అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సిబ్బంది సూచనలు తీసుకోవాలన్నారు.

– జలుమూరు

తుఫాన్ భయం



ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు చేస్తున్న రైతులను తుఫాన్ భయపెడుతోంది. ప్రస్తుతం పంట కంకు దశకు చేరుకుంది. మరికొన్ని రోజుల్లో దిగుబడులు ఇంటికి చేరుకుంటాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే తుఫాన్ హెచ్చరికలతో మంగళవారం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో రైతులు కలవరపడుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

17న వ్యాస రచన పోటీలు

హిరమండలం: భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా ఈనెల 17వ తేదీన వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థ జోనల్ కన్వీనర్ చంటి మాస్టర్, సమితి కన్వీనర్ ఊణ్ణ వెంకటరమణలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలల్లో వ్యాస రచన పోటీల నిర్వహణకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల అనుమతులు కోరారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అవలంగి, భగీరథిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామేశ్వరి డిగ్రీ కళాశాల, సన్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో ఈ వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

8, 9, 10 తరగతితో పాటు ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్థులు ఈ వ్యాస రచన పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

అవినీతిమయంగా ఆమదాలవలస

- ఎమ్మెల్యే కూన వందల కోట్ల అక్రమార్జనలు
- పెట్టుబడిలేని ప్రకృతిపైనే ఆయన దృష్టి
- ధ్వజమెత్తిన సువ్వారి గాంధీ



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస: ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమదాలవలసను అవినీతిమయంగా మార్చేస్తున్నారని గత ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సువ్వారి గాంధీ అన్నారు. పట్టణంలో బొడ్డేపల్లిపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల కాలంలో ఆమదాలవలస మండలంలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లు లేకపోయినప్పటికీ, యథేచ్ఛగా కొన్ని వందల లారీల్లో ఇసుక విశాఖపట్నానికి తరలిపోతోందన్నారు. తోటాడ, దూసి, తొగరాం, ఇసుకలపేట, దిబ్బలపేట, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, చెవ్వాకులపేట ఇసుక ర్యాంపుల నుంచి నిత్యం పదుల సంఖ్యల్లో లారీల్లో ఇసుక తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. బూర్జ మండలంలోని ఖాఖండ్యాంలో ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినప్పటికీ ఒక బిల్లుపై నాలుగైదు లారీల ఇసుక తరలిపోతున్నదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇసుక లారీ రూ.16 వేలకు లభించేదని, కానీ ఇప్పుడు ఉచితం అని చెబుతూనే అనధికారికంగా రూ.30 వేలు వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు, వ్యవస్థలు ఎమ్మెల్యేకు దాసోహం కావడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో నాయకులు పేడాడ వైకుంఠరావు, సువ్వారి అనిల్ కుమార్, అన్నెపు సూరిబాబు, రాపాక మాజీ ఎంపీటీసీ పోతురాజు సూర్యారావు, బొడ్డేపల్లి గోవింద, పైడి విజయ రమణ, ఎ.వాసుదేవరావు, బెండి రాజేష్, పాపారావు ఇల్లాకుల శ్రీను, గురుగుబెల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో పాలన అస్తవ్యస్తం

- ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: సచివాలయ వ్యవస్థతో పాలన అస్తవ్యస్తమైందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని యర్రావారి కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. సచివాలయంలో మహిళా పోలీసు ఉద్యోగానికి కనీసం పనిలేదని, వారికి ఎటువంటి చట్టబద్ధత లేదన్నారు. వారికోసం అసెంబ్లీలో లేవనెత్తుతానని మహిళా పోలీసులకు హామీ ఇచ్చారు. గ్రీవెన్స్ పోర్టల్‌లో డిజిటల్ అసిస్టెంట్లు ఫిర్యాదులు సక్రమంగా నమోదు చేయడం లేదని, ముఖ్యంగా నూతన రేషన్‌కార్డులకు వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఫిర్యాదులను ఖచ్చితంగా గ్రీవెన్సు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రాపాక కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు, పొందూరు పట్టణానికి సంబంధించి అన్ని రకాల ఆక్రమణలపైనా తనకు నివేదికను అందించాలని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూన సత్యారావు, అన్నెపు రాము, సీపాన శ్రీరంగ నాయకులు, శంకర భాస్కర్, బాడాన గిరి, ఎ.చినరంగ, ఎ.విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితా ప్రచురణ



ఈ–క్రాప్ జాబితా ప్రదర్శిస్తున్న దృశ్యం

నరసన్నపేట: రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితా ప్రచురించడం జరిగిందని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. మడపాం రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకున్న రైతుల జాబితాను మంగళవారం ప్రచురించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జాబితాలను సామాజిక తనిఖీల కోసం ప్రచురించడం జరిగిందని, రైతులు తమ పేర్లు పరిశీలించుకోవాలన్నారు. ఈనెల 18న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల వద్ద పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలని, వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మడపాం ఎంపీటీసీ రువ్వ వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం రావులవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ఆమదాలవలస: సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. మండలంలో శ్రీనివాసచార్యులపేట గ్రామంలోని రైతుసేవ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏవిధంగా ఎదుర్కోవాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణం వేడి ఎక్కువగా ఉండడం వలన దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు రోజూ పొలాన్ని పరిశీలించాలని, దోమలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, విలేజ్ అగ్రి కల్చరల్ అసిస్టెంట్ పీసా జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం షాపులు స్వాధీనం



స్టాక్ స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ సీఐ రమణమూర్తి, ఎస్ఐ గురుమూర్తిలు

నరసన్నపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న 12 ప్రభుత్వ మద్యం షాపులను మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షాపుల్లో ఉన్న స్టాక్, అమ్మకాల ద్వారా వచ్చిన నగదును రికార్డుల ప్రకారం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ రమణమూర్తి తెలిపారు. ఈ స్టాక్ డిపోకు పంపిస్తామన్నారు. రేపటి నుంచి మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం షాపుల్లో ఉన్న సిబ్బంది రేపటి నుంచి రావనవసరం లేదని స్పష్టం చేశారు.

జగదీశ్వరరావుకు మాతృ వియోగం



రాజేశ్వరమ్మ(ఫైల్)

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసకు చెందిన పంచాయతీ రాజ్ విశ్రాంత ఈఈ నాయుడుగారి జగదీశ్వరరావు తల్లి రాజేశ్వరమ్మ(83) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి తదితరులు సంతాపం తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఎస్సీలకు కేటాయించాలి

సారవకోట: మండలంలోని కిడిమి పంచాయతీ భద్రాచలం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం దళితులకు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు తహసీల్దార్ విజయలక్ష్మిని మంగళవారం కోరారు. ఈ గ్రామంలో 44 దళిత కుటుంబాలు ఉంటున్నాయని, ఇళ్లకు సమీపంలో ఖాళీ స్థలంను అగ్రకులస్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని దళితులకు కేటాయించాలని కోరారు.

ఆదర్శనీయుడు కలాం

మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శనీయుడని వక్తలు కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అబ్దుల్ కలాం జయంతోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, గ్రంథాలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: కురిగాం ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బూర్జ: ఓవీపేట జెడ్పీ హైస్కూల్‌లో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది



పొందూరు: తాడివలసలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాలలో కలాం అక్షరాకారంలో విద్యార్థులు



హిరమండలం: కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నరసన్నపేట: డిగ్రీ కళాశాలలో కలాం చిత్రపటానికి నివాళులు

చేతుల శుభ్రతపై అవగాహన

హిరమండలం: ఐక్యరాజ్య సమితి గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘ మహిళా సభ్యులకు శానిటేషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుజాత, జయంతి, శ్రీదేవి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజలు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ, ఓంద్రుజోల, కర్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీ, పారాపురం, గూనభద్ర గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్లు, సిమెంట్ కాలువల నిర్మాణాలు కోసం ఆయా గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీలతో పాటు నాయకులు భూమి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో నీరజ, జేఈఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి

హిరమండలం: పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పింద్రువాడ, చవితిసీది, ఎంఎల్‌పురం, అంబావల్లి, కిట్టాలపాడు, భగిరథీపురం, నీలాదేవిపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం పనులు ప్రారంభం

నరసన్నపేట: మండలంలోని పోతయ్యవలసలో మంచినీటి బోర్లు వద్ద ప్లాట్‌ఫారంలు నిర్మాణాలను నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనపల శేఖరరావు మంగళవారం ప్రారంభించారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఈ పనులను ప్రతిపాదించగా రూ.60 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో గోపాలపెంట పంచాయతీ కార్యదర్శి జావెద్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని అర్హులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. కళాశాలలో ఎంఎస్సీ(రసాయనిక శాస్త్రం), ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 21లోగా ఎవరైనా వచ్చి జాయిన్ కావచ్చన్నారు. మరింత సమాచారం కోసం 95028 66738 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.